క్లుప్తంగా

మోటార్లు పెడితే సహించేది లేదు



కుళాయిలను పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని గూనపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి కుళాయిలను పరిశీలించారు. మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లదేనన్నారు. కుళాయిలకు మోటార్లు బిగిస్తే సహించేది లేదని, ప్రతి ఒక్కరికి తాగునీరు అందాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈ సుగుణాకర రావు, డీఈ రమణమూర్తి, ఏసీపీ వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం



పబ్లిక్ పాసిక్యూటర్లను సత్కరిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియామకమైన ఇద్దరు న్యాయవాదులను మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. రెండో అదనపు జిల్లా, సెషన్స్ కం మహిళా కోర్టు పబ్లిక్ పాసిక్యూటర్‌గా చింతాడ సత్యనారాయణ, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోలుగు వెంకటరమణలకు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు సనపల హరి, గేదెల వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

ఎచ్చెర్ల: ప్రతీ ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని లావేరు ఎంపీడీఓ ఎస్.కొండలరావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల, పార్టీల పోస్టర్లు ఉండకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మీదేవి

ఎచ్చెర్ల: ఓటరు జాబితా సవరణ చేపడుతున్నట్లు లావేరు తహశీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబితాలో మార్పులు చేర్పులు చేపడుతున్నామని, అనర్హత కలిగిన వారివి, మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు.

విజయగణపతికి విశేష పూజలు



విజయగణపతికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాల తనిఖీ చేపడుతున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని బలగ కూడలిలో మంగళవారం సాయంత్రం రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ వాహన తనిఖీలు జరిపారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, విత్‌అవుట్ లైసెన్సు, ట్రిబుల్ రైడింగుల్లో పట్టుబడిన 17 వాహనాలను పట్టుకుని రూ.13 వేలు వరకు చలానాలు కట్టించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని, విధిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు.

‘మార్గం’ సుగమం!

- సర్క్యులేషన్ పేట్రన్ అంశంలో కదలిక
- నాలుగు నెలల క్రితమే ఆమోదించిన ప్రభుత్వం
- పాత కలెక్టర్ వద్దే ఫైల్
- చిన్నపాటి అంశాలు సరిచేయాలన్న ప్రస్తుత కలెక్టర్



బొందిలీపురంలో ఇరుకు రోడ్డు

శ్రీకాకుళం: నగర పరిధిలో 15 అడుగుల లోపు రహదారులు ఉన్న ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సర్క్యులేషన్ పేట్రన్‌కు త్వరలో ఆమోదం లభించనుంది. నగరంలో ఇళ్లు నిర్మించాలంటే స్థలం ముందు భాగంలో 10 అడుగులు నగర పాలక సంస్థకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనల వల్ల చిన్నచిన్న రహదారులు ఉన్న ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం చేయాలనుకునే పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ నిబంధనలకు దీర్ఘకాలిక సడలింపు లభించింది. 15 అడుగుల లోపు రోడ్డు ఉన్న ప్రాంతంలో పది అడుగులు విడిచిపెట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు కోరగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కొన్ని ప్రాంతాల నుంచి తమ వీధులను కలపాలని కోరుతూ అభ్యర్థనలు వచ్చాయి. ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ దీనిని ఆమోదిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాన్‌కు అనుమతి వచ్చి ఉండేవి. అయితే గత కలెక్టర్ తన వద్దనే ఈ ఫైల్ ఉంచుకున్నారని, ఇటీవల నగరంలో జరిగిన బిల్డర్ల సమావేశంలో పాల్గొన్న మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. ఆదే సమావేశంలో పాల్గొన్న నగర కమిషనర్ తమీమ్ అన్సారియా దృష్టికి కూడా కొందరు బిల్డర్లు తీసుకెళ్లి సమస్య వివరించారు. మున్సిపల్ అధికారుల ద్వారా ప్రస్తుత కలెక్టర్‌కు సమస్యను వివరించారు. ఫైల్ పరిశీలించిన కలెక్టర్ చిన్నచిన్న మార్పులు చేయాలని, ఆయా ప్రాంతాల్లో ఉన్న పెద్దపెద్ద స్థలాలకు ఈ సడలింపు లభించకుండా ఉండేలా చూడాలని చెప్పడంతో ఆ మేరకు ఫైల్ సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే దీనికి ఆమోదం లభించే అవకాశాలు ఉన్నాయి.

కలెక్టర్ సూచనల మేరకు మార్పులు

కమిషనర్ ఆదేశాల మేరకు ఫైల్‌కు సంబంధించిన అంశాలను కలెక్టర్‌కు వివరించాం. ఇందులో చిన్నచిన్న మార్పులు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ఆ మార్పులు సిద్ధం చేశాం. కలెక్టర్‌కు నివేదిస్తాం. కలెక్టర్ ఆమోదిస్తే ప్లాన్‌కు అనుమతులు లభిస్తాయి.

– ఉమామహేశ్వరరావు, టీపీఓ, నగరపాలక సంస్థ, శ్రీకాకుళం

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ‘ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్’ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.
జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.
రణస్థలం: మండలంలోని లంకపేట కేజీబీవీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.హైమవతి ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతుల్లోనూ ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గడ్డి కుప్ప దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకోర్టు సమీపంలో చిరంజీవినగర్‌లో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డి కుప్ప దగ్ధమైంది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. చిరంజీవినగర్‌లో ఉంటున్న సంపతిరావు వెంకటసత్యనారాయణ తన పశువుల మేతకోసం ఇంటి వెనుక షెడ్డులో నాలుగు బళ్ల గడ్డికుప్పను నిల్వ ఉంచారు. అటుగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి వదిలేయడంతో ఆ నిప్పురవ్వలు గడ్డికుప్పపై పడి మంటలు చెలరేగాయి. దీంతో సగం వరకు గడ్డికుప్ప కాలిపోయింది. అప్పటికే అక్కడికి అగ్నిమాపక శకటంతో చేరుకున్న సిబ్బంది దుర్గారెడ్డి, నాయుడుల బృందం మంటలను అదుపుచేసింది. ఈ ప్రమాదంలో రూ.10 వేలు ఆస్తినష్టం జరిగినట్లు ఏడీఎఫ్‌వో చెప్పారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జి.సిగడాం : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పార్టీ జెండాలు తక్షణమే తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ రామచంద్రరావు, బూత్ లెవల్ అధికారులు పి.జగన్నాథం, బి.నర్సింగరావు, ప్రసాద్‌సాహు, శ్రీనివాసరావు, స్వాతి, భవాని, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై సర్వే



ఎచ్చెర్లలో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ విద్యార్థులు ఎస్ఎంపురం, ఎచ్చెర్లల్లో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ముకుందరావు, పీవోలు ఈశ్వరరావు, సింహాచలం పర్యవేక్షించారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్వర్యంలో ధర్మనీలాపురంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–3 సేవా శిబిరం కొనసాగుతోంది. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి శివప్రసాద్ ఆన్‌లైన్ మోసాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగాన్ని వివరించారు.

ఓటింగ్ శాతం పెంపుపై అవగాహన



జి.సిగడాం: అవగాహన కల్పిస్తున్న ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు



గార: సంత తోటలో ఓటరు అవగాహన సమావేశం

జి.సిగడాం: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా మంగళవారం జి.సిగడాం ఐకేపీ ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, సీసీలు ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌లో 85 శాతం పోలింగ్ నమోదు అయ్యేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వరి, మురళీ, శ్రీదేవి, మంగమ్మ ,కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.
గార: వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు మంగళవారం గారలోని సంతలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం భాగ్యలత మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్ల పాటు మంచి ప్రభుత్వం ఏర్పడేందుకు ఓటు కీలకమని చెప్పారు. ఓటు హక్కు– మన జన్మ హక్కు, ఓటును నిర్భయంగా వేయండి, మంచి ప్రభుత్వం రావాలంటే ప్రలోభాలకు లొంగకండి అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూర ర్యాలీ నిర్వహించారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

కంచిలి:

మండలంలోని ఒడిశా సరిహద్దు గ్రామం ఘాటీముకుందాపురం వద్ద సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు, తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, సారా, గంజాయి తదితర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా పట్టుబడినట్లయితే తక్షణమే అధికారులకు సమాచారం అందించి, తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేశ్వరరావు, స్థానిక ఎస్సై రాజేష్ ఉన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

వైభవంగా భద్రమ్మ తల్లి ఉత్సవం



గార మండలం అంపోలు పంచాయతీ రామకృష్ణాపురం గ్రామదేవత భద్రమ్మ తల్లి, శ్రీకూర్మం పంచాయతీ జల్లపేట గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణాపురంలో 50 ఏళ్ల తర్వాత ఉత్సవం జరుగుతుండటంతో ఇంటికో ఘటం చొప్పన బయల్దేరి గ్రామమంతా తిరిగి అమ్మవారికి చల్లదనం చేశారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– గార

వైఎస్సార్ సీపీని గెలిపించాలి



పూడివలసలో అసిరితల్లికి పూజలు చేస్తున్న గొర్లె పరిమళ

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ కోరారు. పూడివలసలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అసిరి తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో వ్యత్యాసం గుర్తించాలన్నారు. జన్మభూమి కమిటీల విధ్వంస పాలనకు మద్దతు ఇవ్వవద్దని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే తప్పనిసరిగా వైఎస్సార్ సీపీనే గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, నాయకులు పైడి త్రిమూర్తులు, బగ్గు రాజారావు, సీపాన ఎర్రంనాయుడు, పైడి మురళి, బోర గోవిందరావు, వెంకన్నగారి శ్రీను పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



గార: బందరువానిపేటలో పోలీసుల కవాతు



గార: ఫరీదుపేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గార: నిర్భయంగా, నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ సార్వత్రిక ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం బందరువానిపేటలో కవాతు జరిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా క్రమశిక్షణా చర్యలు తప్పవని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.
ఎచ్చెర్ల క్యాంపస్ : ఫరీదుపేటలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రజా చైతన్యం కోసం మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ ప్రశాంతంగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

సామాజిక సేవతో గుర్తింపు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాంఘిక, సామాజిక సేవలతో వ్యక్తులకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. ‘వరల్డ్ సోషల్ వర్క్ డే’ సందర్భంగా కళాశాల సోషల్ వర్క్ విభాగం అధ్యాపకురాలు జి.నవీన అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సోషల్ వర్క్ అనేది దైనందిన జీవితంలో భాగంగా మారిందని చెప్పారు. బీఆర్ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.కావ్య మాట్లాడుతూ సోషల్ వర్క్‌లో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. అనంతరం సోషల్‌వర్క్ లెక్చరర్లను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, టి.ఆదిలక్ష్మి, జి.సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

శ్రీకాకుళం క్రైమ్ : పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 30 పోలీసు యాక్ట్, 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎస్పీ రాధిక అన్నారు. మంగళవారం నగరంలోని చైతన్య, శ్రీ కేశవరెడ్డి పాఠశాల కేంద్రాలను తనిఖీ చేసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి తీసుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం

ఇచ్ఛాపురం రూరల్: కేశపురం గ్రామ దేవత ముత్యాలమ్మ సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండాల భానమ్మ వంశీయులు ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలో కవిటి కళాకారులు నృత్యాలతో అలరించారు. సన్నాయి మేళంతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.



కాళీమాత వేషధారణతో ముత్యాలమ్మ ఊరేగింపు

యాగంతో పుణ్యఫలం

ఇచ్ఛాపురం రూరల్: ఎక్కడ యాగం జరుగుతుందో అక్కడ పుణ్యం సిద్ధిస్తుందని శ్రీకూర్మం పుణ్యక్షేత్ర ప్రధానార్చకులు వరదాచార్యులు అన్నారు. సన్యాసిపుట్టుగలో కల్యాణ వెంకటేశ్వర ఆలయ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా వేదపండితులు యాగశాలార్చన కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి విగ్రహాలను ప్రత్యేక పల్లకిలోఉం ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాగశాలార్చన పూజలు చేస్తున్న పండితులు

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

మందస:

సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయాధికారి గుంట మురళీ అన్నారు. పుచ్చపాడు, డబారు గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ సేవా శిబిరంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై వలంటీర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. పొలంబడి నిర్వహించారు. పూర్వీకులు వ్యవసాయంలో అవలంబించిన పద్ధతులు ఇప్పుడు కొనసాగించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ముందుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి వీధులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, పీవో సోమేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది